

జూపార్కులోని రాయల్ బెంగాలీ టైగర్స్

## జూపార్కులో సందర్శకులను ఆకట్టుకుంటున్న
# తెల్ల పులులు,రాయల్ బెంగాల్ టైగర్స్

**చార్మినార్,నవంబరు 22 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులోని పులులు సందర్శకులను ఎంత గానో ఆకట్టు కుంటున్నాయి.జూ పార్కును తిలకించటానికి వచ్చే పర్యాటకులు పులులను చాలా ఆసక్తితో చూస్తుంటారు.ప్రతీ రోజు వేలాది మంది పర్యాటకులు జూపార్కును తిలకించటానికి వస్తుంటారు.శని,ఆదివారాలతో పాటు వేసవి,సంక్రాంతి,దసరా పండుగ సెలవులలో జూ పార్కు సందర్శకులతో కిక్కిరిసి పోతుంది.కాగా జూ పార్కును చూడటానికి వచ్చే పర్యాటకులు జూపార్కులోని పులులు, సింహాలను ఎంతో మక్కువతో తిలకిస్తుంటారు. పులుల సంరక్షణ కోసం జూ పార్కు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.నెహ్రూ జూలాజికల్ పార్కులో ప్రస్తుతం 18 పులులు ఉన్నాయి. వీటిలో 12 తెల్ల పులులు,6 బెంగాలీ రోయల్ టైగర్స్.జూపార్కులోని సఫారీ పార్కులో నాలుగు తెల్ల పులులు,ఒకటి బెంగాలీ రాయల్ టైగర్ ఉంది.జూ పార్కులోని ఎన్‌క్లోజర్‌లో ఉన్న తెల్ల పులులు,బెంగాలీ టైగర్ పులులు సందర్శకులను ఎంత గానో ఆకట్టు కుంటున్నాయి.ప్రతీ రోజు రెండు పూటల పులులకు ఆహారాన్ని అందిస్తారు.ఉదయం 10.30 గంటలకు పులులకు ఒకటిన్నర కిలో చికెన్, అనంతరం ఆఫ్ లీటర్ పాలల్లో పంచదార కలిపి ఇస్తారు.తిరిగి సాయంత్రం 4.30 గంటలకు ఆరు కిలోల మాంసం,రెండు కిలోలు ఎముకలు ఆహారంగా పులులకు అందిస్తారు.కాగా వారంలో ప్రతీ శుక్రవారం సాయంత్రం మాత్రం పులులకు,సింహాలకు ఎటువంటి ఆహారాన్ని ఇవ్వరు. పరిశుభ్రమైన మంచి నీరు పులులు త్రాగటానికి ఎన్‌క్లోజర్ వద్ద ఉంచుతారు. సాధారణంగా పులులు 12 సంవత్సరాలు మాత్రమే జీవిస్తాయి.అయితే జూ పార్కులోని పులులకు వెటర్నరీ వైద్యులు ప్రతీ రోజు ఉదయం,సాయంత్రం రెండు సార్లు వాటి యొక్క ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటారు.వైద్య సేవలు పులులకు లభిస్తుండటంతో జూపార్కులోని పులులు 18 సంవత్సరాలు వరకు జీవిస్తాయని జూపార్కు అధికారులు వెల్లడించారు.కాగా జూ పార్కులో ఉన్న నూట యాభై ఎన్‌క్లోజర్లలో పలు రకాల జంతువులు,పక్షులు దాదాపు రెండే వేల వరకు ఉన్నాయి. జూ పార్కును పరిశుభ్రంగా ఉంచటంతో పాటు జంతువుల పరిరక్షణ కోసం అన్ని చర్యలు తీసున్నందుకు 2024--25 సంవత్సరానికి జూపార్కుకు ఐఎస్ఓ సర్టిఫికెట్ లభించింది.


నెహ్రూ జూలాజికల్ పార్కులోని తెల్ల పులులు



# హైదరాబాద్ వార్త

# హైడ్రా..జిహెచ్ఎంసిలో భాగం కాదు

### -ప్రత్యేక విభాగం : హైడ్రా కమిషనర్ రంగనాథ్




**హైదరాబాద్, నవంబరు 22,ప్రభాతవార్త:** హైడ్రా.. జీహెచ్ఎంసీలో భాగం కాదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తేల్చి చెప్పారు. ఇది వరకు ఈవీడీఎం పేరుతో జీహెచ్ఎంసీలో భాగంగా ఉండేదని, అప్పుడ ఐఎఎస్‌లు, కమిషనర్లు ఉండేవారని, ఇప్పుడు సెపరేట్ వింగ్‌గా ఏర్పడిందని వివరించారు. కేవలం జీహెచ్ఎంసీలో మాత్రమే కాకుండా చుట్టుపక్కల ఉన్న మరో 27 మున్సిపాలిటీల పరిధిలోనూ హైడ్రా పనిచేస్తుందని తెలిపారు.ఇండియా మెట్రోలాజికల్ డిపార్టుమెంట్ 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ వెదర్, క్లైమెట్ సర్వీసెస్ పై స్టేక్ హోల్డర్స్ మీటింగ్ జరిగింది. బేగంపేట్ గ్రీన్ ల్యాండ్‌లోని నిజామియా అబ్జర్వేటరీ సెస్ ఆడిటోరియంలో వన్ డే వర్క్ షాప్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఐఎండీతో కలిసి హైడ్రా పనిచేస్తుందని చెప్పారు. ఐఎండీ 1875లో ఏర్పడిందని, హైడ్రా 2024 జులైలో ఏర్పడిందని రంగనాథ్ గుర్తుచేశారు. అర్బన్ డిజాస్టర్స్, ఆక్రమణలకు అడ్డు కట్టవేయడం కోసం ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందని చెప్పారు. హైడ్రాకు మొదటి కమిషనర్‌గా ఉండటం సంతోషంగా ఉందని, హైడ్రా దేశంలోనే మొదటి సారి ఏర్పాటైందని తెలిపారు.డిజాస్టర్స్ కూడా మార్పులు వస్తున్నాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. "తెలంగాణలో అర్బనైజేషన్ పెరుగుతుంది, తాను ట్రాఫిక్ విభాగంలో పనిచేసినప్పటి నుంచి చూస్తున్నా. వెహికిల్ పాపులేషన్ 80 లక్షలు దాటింది. హైదరాబాద్‌లో ట్రాఫిక్ అడిషినల్ సీపీగా కూడా పనిచేశాను. 2, 3 సెంటిమీటర్ల వర్షం పడితే మూడు, నాలుగు గంటలు ట్రాఫిక్ జామ్ అవుతుంది.మెట్రో సిటీలలో క్లైమెట్ ఛేంజెస్ ఎక్కువగా ఉన్నాయి క్లౌడ్ బరస్ట్స్ కూడా పెరుగుతున్నాయి.నాలాలు, చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. వర్షం పడినప్పుడు వరద నీరు ఇంకడానికి చాలా సమయం పడుతుంది. సాయంత్రం 4, 5 గంటలకు వర్షం పడితే భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. నీరు ఇంకడానికి మార్గాలు లేవు" అన్నారు.సిటీలో 150 వాటర్ లాగింగ్స్ ఉన్నాయి. అర్బన్ డిజాస్టర్ల మీద ఫోకస్ పెట్టాలి.157 ఏడబ్ల్యుఎస్ స్టేషన్స్ ఉన్నాయి. ఇంకా కావాలి అన్నారు.ప్రతీ 15 నిమిషాలకు బెంగుళూరులో ఏడబ్ల్యుఎస్ స్టేషన్ల నుంచి డేటా కలెక్ట్ చేస్తారు. మనం కూడా దీనికి మారాలి.సిటీలో వెదర్ రాడర్స్ కావాలి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి హిల్ ఏరియాలలో పెట్టాల్సిన అవసరం ఉంది. వెదర్ అలర్ట్స్ స్పెసిఫిగ్గా ఉండాలి. ఇక్కడ వర్షం పడుతుంది అని కాకుండా ఇక్కడ పడదు అని చెప్పేలా వెదర్ అలర్ట్స్ ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

# ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్..!

### -అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోని వైనం

### -ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని దుస్థితి


ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

**నిజాంపేట్, నవంబరు 22, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి జర్నలిస్టు కాలనీలో ప్రధాన దారికి ఇరువైపులా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. గత కొన్ని రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకొని అక్కడున్న కొంతమంది నిర్వాహకులు కమర్షియల్ దుకాణ సముదాయ షెడ్డు నిర్మాణాలు చేపట్టడం ద్వారా సమస్య ఇప్పుడు మరింత జఠిలంగా మారింది. ఆయా దుకాణాలకు వచ్చిపోయే స్థానిక ప్రజలతో పాటు ఈ మార్గం గుండా వచ్చి పోయే వాహనదారులకు ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉందని స్పష్టంగా దర్శనమిస్తుంది. దీనికి తోడు ఆయా షాపుల నిర్వాహకులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తాత్కాలికంగా షాపులకు ఉండే ప్రకటనలు బోర్డులను అమర్చారు. దీని ద్వారా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించే అవకాశాలు లేకపోలేదు. దీనిపై సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి స్థానికులు పలుమార్లు తీసుకెళ్లిన పట్టించుకున్న పరిస్థితి లేదని అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు నిజాంపేట్ జర్నలిస్టు కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదం నుండి రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రజావాణి వల్ల అందిన ఆటో

### -ఆనందం వ్యక్తం చేసిన లబ్దిదారుడు మేదరి అశోక్

### -ఎలక్ట్రికల్ ఆటోలో ప్రయాణించిన చిన్నారెడ్డి,దివ్యలు


ప్రజావాణీ వల్ల అందిన ఎలక్ట్రిక్ ఆటో వద్ద లబ్దిదారునితో డా.చిన్నారెడ్డి.దివ్యలు.

**బేగంపేట నవంబరు 22,ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణీ ద్వారా ఒక లబ్దిదారునికి ఎలక్ట్రికల్ ఆటో అందింది.దీంతో అతడు ఎంతో ఆనందం వ్యక్తం చేసాడు .నగరంలోని ఎర్రగడ్డకు చెందిన ఎస్సీ యువకుడు మేదరి అశోక్ కు స్వయం ఉపాధి పథకం కింద ఎలక్ట్రిక్ ఆటో సకాలంలో అందింది.దీంతో అతను ఎంతో సంతోషానికి గురయ్యాడు.శుక్రవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణీ కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఆటోను తీసుకొని వచ్చి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.జి.చిన్నారెడ్డి.స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌లను ఎలక్ట్రికల్ ఆటోలో ఎక్కించుకుని అశోక్ సవారీ చేసారు.హైదరాబాద్ జిల్లా ఎస్సీ కార్పోరేషన్ సబ్సిడీ ద్వారా స్వయం ఉపాధి కోసం మేదరి అశోక్‌కు ఎలక్ట్రికల్ వాహనం కొనుగోలు చేసేందుకు రుణం మంజూరైంది.అయితే వాహనాల డీలర్ వద్ద ఎలక్ట్రికల్ ఆటో రిలీజ్ కోటా మించి పోవడం తో ఆటో ఇవ్వడం కుదరదని డీలర్ అశోక్‌కు తెలియజేసాడు.దీంతో అతను ముఖ్యమంత్రి ప్రజావాణీ కార్యక్రమం లో తన పరిస్థితిని వివరిస్తూ మూడు వారాల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు.ప్రజావాణీ స్టేట్ నోడల్ ఆఫీసర్ దివ్యదేవరాజన్ రవాణాశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ఎలక్ట్రికల్ ఆటోను రిలీజ్ చేయించారు.ఎలక్ట్రికల్ ఆటో ద్వారా రోజుకు కనీసం వెయ్యి రూపాయలు సంపాదించుకుంటున్నట్లు అశోక్ తెలియజేసాడు.ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి,దివ్య దేవరాజన్‌లకు అశోక్ కృతజ్ఞతలు తెలియజేసారు.

# ఎవరైనాసరే.. వదిలేదిలేదు

### అక్రమణలకు సహరించిన అధికారులు · నాయకులపై హైడ్రా ఫోకస్
### ఇప్పటికే పలువురు అధికారులపై కేసులు · మరికొంతమంది అవినీతి ఆఫీసర్లపై నజర్

**హైదరాబాద్, నవంబర్ 21,ప్రభాతవార్త:**

వాళ్లు తలుచుకుంటే చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు ఇలా ఏవైనా సరే మాయం చేయగల తెగువ వారిలో ఉంది. కానీ ఇప్పుడు తీరిగ్గా లెక్కలు చూస్తుంటే, పెద్ద సంఖ్యలో చెరువుల జాడ లేకుండా పోయినట్లు తెలుస్తోంది. అక్రమాలకు పాల్పడిన అధికారులపై, నిబంధనలకు నీళ్లొదిలి ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చిన వారిపై అవినీతి నిరోధక దృష్టి సారించింది. అయితే ఇప్పటికే వారిపై కేసు నమోదైతే వారితో పాటు కబ్జాలకు అధికారిక అనుమతులు ఇచ్చిన వారందరి అక్రమార్జన బాగోతాలను వెలికి తీయనుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఏసీబీ ఇప్పటికే వీరందరి జాబితాను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. నీటి వనరులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా గత పదేళ్లలో జరిగిన ఆక్రమణలకు సంబంధించి ఉపగ్రహ సమాచారం ఆధారంగా వివరాలు రాబడుతుంది. ఆసమాచారం ప్రకారం ఓఆర్ఆర్ లోపల పదేళ్లలో 44 నీటి వనరులు పూర్తిగా, 127 పాక్షికంగా ఆక్రమణలకు గురైనట్లు ప్రభుత్వం గుర్తించింది. ఇందుకు కారకులైన రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చినట్లు గుర్తించారు. ఇప్పటికే చందానగర్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎం.రాజ్ కుమార్, చందానగర్ సర్కిల్ 21 డిప్యూటీ కమిషనర్ ఎన్.సుధామ, నిజాంపేట మున్సిపల్ కమిషనర్ పి.రామకృష్ణారావు, బాచుపల్లి ఎమ్మార్వో పూల్‌సింగ్, హెచ్ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి సుధీర్ కుమార్, మేడ్చల్ జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్ కె.శ్రీనివాసులుపై కేసులు నమోదు అయ్యాయి. ఈ క్రమంలో వీరిపై దర్యాప్తు జరుగుతోంది. మరికొంతమంది అధికారులు..రెవెన్యూ, నీటిపారుదల, నగరపాలక, హెచ్ఎండీఏ వంటి అన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతిపరులైన కొందరు అధికారులు ఉన్నారు. అలాగే అధికారులతో పాటు సిబ్బంది కూడా ప్రైవేట్ వ్యక్తులతో కుమ్మక్కై చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో అక్రమాలకు సహకరించినట్లుగా హైడ్రా గుర్తించింది. ఇదంతా వందల కోట్ల బిజినెస్‌గా తేల్చింది. ఈ వ్యవహారంపై, సిబ్బంది అక్రమార్జనపై ఏసీబీతో విచారణ చేయిస్తున్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా చెరువులు, కుంటలను మాయం చేయడంలో కొందరు అధికారులు కీలక పాత్ర పోషించారు. అయితే వారు ఉద్యోగ విరమణ చేసినా, వారి అక్రమార్జన కూడా వెలికి తీయాలని ప్రభుత్వం భావిస్తోంది. కబ్జాల్లో ముఖ్యపాత్ర పోషించిన ఓ అధికారి వల్ల సగం చెరువులు, కుంటలు మాయమయ్యాయని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు అధికార పార్టీలోకి మారిన అప్పటి ప్రముఖ ప్రజాప్రతినిధి ఒకరు ఇందులో కీలక పాత్ర పోషించినట్లు అధికారులు గుర్తించారు. అప్పట్లో కబ్జా అయిన ఆస్తులు, నిర్మించిన కట్టడాలు, వాటి యజమానులతో సదరు అధికారితో పాటు ప్రజాప్రతినిధికి ఉన్న సంబంధాలపై కూడా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.



**కూల్చివేత బాధితులకు పరిహారం..**

నగరంలో ఓ బడా నిర్మాణ సంస్థ బాచుపల్లిలో చెరువును ఆనుకొని ఎఫ్‌టీఎల్‌లోనే రెండు టవర్లను నిర్మించింది. దాదాపు అక్కడ 1000 మంది ఒక్కో ఫ్లాట్‌ను రూ.80 లక్షల నుంచి రూ.కోటిన్నర వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. ఎఫ్‌టీఎల్‌లోనే ఈ ఫ్లాట్లు ఉన్నందున హైడ్రా చర్యలు చేపడితే, అందులో ఉంటున్న వారంతా రోడ్డున పడే అవకాశం ఉంది. మూసాపేటలోనూ ఓ నిర్మాణ సంస్థ ఏకంగా చెరువు ఎఫ్‌టీఎల్‌ను మార్చేసి అపార్ట్‌మెంట్ల నిర్మాణాన్ని దాదాపు పూర్తి చేసింది. ఇవే కాకుండా నగరంలో అక్రమ నిర్మాణాలు భారీగానే ఉన్నాయి. ఇందులో కొన్ని తప్పుడు పత్రాలతో అనుమతులు పొందారు. నిబంధనల ప్రకారం అయితే వీటిని హైడ్రా కూల్చివేయాల్సిందే. ఒకవేళ ఇదే జరిగితే ఎన్నో ఏళ్ల కింద కొనుగోలు చేసిన సామాన్యులు రోడ్డునపడతారు. ఈ నేపథ్యంలో ఇలాంటి నిర్మాణాల కూల్చివేతల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంటే బాగుంటుందనే ఆలోచనలో హైడ్రా అధికారులున్నారు. బాధితులకు బిల్డర్ల నుంచి పరిహారం ఇప్పించాలని భావిస్తున్నట్లు సమాచారం.

## భారతీయ సంస్కృతిలో సంప్రదాయ కళలకు ప్రత్యేకత

### -తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


హరికథా గానంలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, నవంబరు 22 ప్రభాతవార్త :** నేటి ఆధునిక సమాజాభివృద్ధిలో ప్రాచీన సంప్రదాయ కళ లు మరుగున పడిపోతున్నా భారతీయ సంస్కృతిలో వాటి ప్రత్యేకత ఎంతో ఉందని, వాటిని కాపాడుకుంటేనే సంస్కృతి ఫరిడవిల్లుతుందని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సమాజం, ప్రజల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆయా అంశాల ఇతివృ త్తంగా సంప్రదాయ కళలను ప్రదర్శించాలని, నేటితరాన్ని అవగాహన కల్పించి పాల్గొనే విధంగా ప్రోత్సహించాలిసన అవసరముందని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలకు తమ పూర్తి సహాయసహకారా లుంటాయని భరోసానిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సంస్థ 47వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వైభవోపేతంగా జరుగుతున్న 4రోజుల సంప్రదాయ కళల ఉత్సవం నాలువ ఆఖరి రోజు శుక్రవారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో శ్రీరామ భట్టార్ భాగవతార్, హైదరాబాద్‌చే అన్నమయ్య హరికథా గానం; పద్మాలయ ఆచార్య భాగవతారిణి నాగర్‌కర్నూల్‌చే పార్వతీ కళ్యాణం హరికథా గానంలు ఆహుతులను భక్తిమార్గంలో పయనింపజేసి ఆధ్యాత్మికలోకంలో విహరింపజేశాయి. డా. సముద్రాల వేణుగోపాలాచారి సభాధ్యక్షతన ఈనాటి ఉత్సవ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, గౌరవఅతిథులు రమ, ప్రభాకర్, వేణుగోపాల్, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో కలిసి ఈనాటి సంప్రదాయ కళల ఉత్సవంలో హరికథా గానం కావించిన భాగవతార్లు శ్రీరామ భట్టార్, పద్మాలయ ఆచార్యలను ఘనంగా సత్కరించి, కిన్నెర సంస్థ రఘురామ్‌ను ఎంతగానో అభినందించారు.వేణుగోపాలాచారి అధ్యక్షోపన్యాసంలో సంప్రదాయ ప్రాచీన సంప్రదాయ కళలను ప్రోత్సహించడం అభినంద నీయమని, వీటి నేటి రానున్నతరాలకు అందజే యడం శ్లాఘనీయమన్నారు.


ఎన్‌టిఆర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన కోటి దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు

## నిమ్స్ చరిత్రలో అరుదైన శస్త్ర చికిత్స

### -బైపాస్ సర్జరీ అవసరం లేకుండానే అత్యాధునిక పరికరాలతో వైద్య చికిత్స

### -హైదరాబాద్ చరిత్రలోనే మొదటిసారి ఈ ఘనత సాధించిన నిమ్స్ కార్డియాలజీ వైద్య బృందం

**పంజగుట్ట, నవంబర్ 22 (ప్రభాతవార్త):** నిమ్స్ చరిత్రలో మొట్టమొదటి సారిగా అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించి రోగి ప్రాణాలు కాపాడారు. మిట్రల్ స్టెనోసిస్‌తో బాధపడుతున్న 56 సంవత్సరాల రోగికి అరుదైన, సంక్లిష్టమైన ట్రాన్స్ కాథెటర్ మిట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. మెయింటెనెన్స్ హెమోడయాలసిస్ అవసరమయ్యే హైపర్‌టెన్షన్, డయాబెటిక్, కిడ్నీ డిసీజ్‌తో కూడా బాధపడుతున్న రోగి సాంప్రదాయక శస్త్రచికిత్సా మిట్రల్ వాల్ రీప్లేస్‌మెంట్ కోసం అత్యంత ప్రమాదకర స్థాయిలో రోగి పరిస్థితి ఏర్పడింది. దీనిని సవాలుగా తీసుకున్న నిమ్స్ కార్డియా లజీ వైద్యబృందం ప్రత్యామ్నాయ ఆధునిక చికిత్స చేసి విజయవంతం అయ్యారు. నిమ్స్ కార్డియాల జీ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్ నేతృత్వంలో డాక్టర్ మణికృష్ణ, డాక్టర్ అభినయ్‌రెడ్డి, డాక్టర్ అనురాగ్‌లతో కూడిన నైపుణ్యం కలిగిన వైద్య బృందం నవంబర్ 19న విజయవంతంగా టీఎమ్‌విఆర్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ బృందం లాంపూన్ విధానాన్ని కూడా అనుసరించడం జరిగింది. ఇంప్లాంటేషన్ తర్వాత రక్త ప్రవాహానికి ఆటంకం ఏర్పడకుండా నిరోధించడానికి రూపొందించిన అధునాతన వాల్వ్ ఏర్పాటు చేశారు.టిఎమ్‌విఆర్ అనేది అత్యాధునికమైన కనిష్ట ఇన్వాసివ్ ప్రక్రియ అని వైద్యులు తెలిపారు. ఇది ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా వ్యాధిగ్రస్తులైన వారికి మిట్రల్ వాల్వ్‌ను భర్తీ చేస్తుందన్నారు. ప్రక్రియలో భాగంగా కొత్త వాల్వ్ కాలులోని రక్తనాళం ద్వారా అమర్చబడి వేగంగా సురక్షితమైన రికవరీని నిర్ధారిస్తుందన్నారు. మిట్రల్ యాన్యులర్ కాల్సిఫికేషన్ ఉన్న రోగిలో టీఎమ్ విఆర్ చేయడం అదనపు కాల్షియం నిక్షేపాల ప్రక్రియను గణనీయంగా క్లిష్టతరం చేస్తాయని వైద్యులు తెలిపారు. ఇది చాలా అరుదని, ప్రపంచవ్యాప్తంగా కొన్నిసార్లు మాత్రమే విజయవంతం అయిందని వా రు తెలిపారు. రోగి మరింత త్వరగా కోలుకోవడానికి ఈ ప్రక్రియ ఎంతగానో తోడ్పడిందన్నారు. చికిత్స అనంతరం రెండురోజుల్లోనే వాకింగ్ చేయడంతో పాటు రోజువారీ కార్యకలాపాలు చేసుకోగలిగాడని, నాలుగారోజు ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ చేయడం జరిగిందని నిమ్స్ వైద్యులు తెలిపారు.

## ర్యాగింగ్ చేస్తే క్రిమినల్ కేసులు

- బాలానగర్ ఏసిపి హనుమంత్‌రావు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏసీపీ హనుమంత్‌రావు

**జీడిమెట్ల, నవంబర్ 22, ప్రభాతవార్త**

ర్యాగింగ్‌తో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే కఠినమైన శిక్షలు ఉంటాయని బాలానగర్ ఏసీపీ హనుమంత్ రావు స్పష్టం చేశారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్ నిరోధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ హనుమంత్ రావు మాట్లాడుతూ, ర్యాగింగ్ చట్ట రీత్యా నేరం. ర్యాగింగ్‌లో పాల్గొనే విద్యార్థులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. అదేవిధంగా, ర్యాగింగ్ తాలూకు నైతిక, చట్టపరమైన ప్రభావాలపై విద్యార్థులకు వివరించి, మంచి విలువలను అలవరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని, ర్యాగింగ్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్ డి.ఐ.కనకయ్య, ఎస్ఐ. నాయుడు, ఎస్ఐ.హరీష్, ఎస్ఐ.సత్యనారాయణ, డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్, డైరెక్టర్ గోవిందా రెడ్డి, డైరెక్టర్ వెంకట్ రెడ్డి, డైరెక్టర్ రామకృష్ణ, డైరెక్టర్ రమేష్ బాబు, కళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు.

## డిమాండ్ల సాధన పోరాటంలో భాగస్వాములవుదాం

-మాజీ సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి, కౌన్సిలర్ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మేడి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ప్రజాప్రతినిధుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేడి శంకర్

**ముషీరాబాద్, నవంబర్ 22, ప్రభాతవార్త:** మాజీ ప్రజా ప్రతినిధుల న్యాయమైన డిమాండ్ల సాధనకై జరిగే పోరాటాలలో అందరం భాగస్వాములవుదామని తెలంగాణ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, కౌన్సిలర్ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మేడి శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కవాడిగూడలో తెలంగాణ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, కౌన్సిలర్ల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సమావేశం మేడి శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంతాప తీర్మానం ప్రవేశపెట్టి, పలు డిమాండ్లపై చర్చించారు. త్వరలో రాష్ట్ర, జిల్లా కమిటీలను ఎన్నుకోవాలని తీర్మానించారు. అనంతరం మేడి శంకర్ మాట్లాడుతూ గతంలో సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా, జెడ్‌పీటీసీలుగా, కౌన్సిలర్‌లుగా ప్రజలకు సేవలు అందించిన మాజీ ప్రజా ప్రతినిధులు నేడు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. మాజీ ప్రజా ప్రతినిధులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని, వారికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ప్రజా ప్రతినిధులకు పెన్షన్ ఇవ్వాలని, ఆరోగ్య భీమా అందించాలని, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, భూమి లేని వారికి భూమి, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కోరారు. మాజీ ప్రజా ప్రతినిధుల సంఘం కోసం హైదరాబాద్‌లో స్థలం కేటాయించి, భవనం నిర్మించేందుకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ బొడ్డు దేవయ్య, నాయకులు చందనగిరి గోపాల్, సుర్వి యాదయ్యగౌడ్, గుంటి మధుసూదన్‌రెడ్డి, మహ్మద్ అబ్దుల్ రహీమ్, కాకునూరి మల్లికార్జున్‌గౌడ్, మల్లేశం గౌడ్, గడాల రాజు, ఏ.మల్లారెడ్డి, బొంగుని ఉప్పలయ్య గౌడ్, కొత్త అప్పారావు, కాలూరు సుంకన్న పాల్గొన్నారు.

## మూసిన గేట్లను ఓపెన్ చేయాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్



కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు నంజుదేశ్వరన్‌ను సన్మానిస్తున్నా ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 22 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని బోయిన్‌పల్లి పెన్షన్‌లైన్‌లోని ఫైజాన్ స్కూల్ గేట్, లాల్‌బజార్‌లోని హన్‌మాన్ దేవాలయం, 108 బజార్లకు ఏర్పాటు చేసిన గేట్లను తొలగించాలని కోరుతూ శుక్రవారం బొల్లారంలోని ఆంధ్ర, తెలంగాణ సబ్ ఏరియా కార్యాలయంలో కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ నంజుదేశ్వరన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయా ప్రాంతాల్లోని విద్యార్థులు, ప్రజలు, భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే శ్రీగణేష్ బ్రిగేడియర్ దృష్టికి తెచ్చారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, సీనియర్ కాంగ్రెస్ నేతలు మురళీ ముదిరాజ్, నాగినేని సరితలు పాల్గొన్నారు.

## రాజీవ్ రహదారి బాధితులకు న్యాయం చేయాలి : తేలుకుంట



రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ సమావేశంలో ప్రసంగిస్తున్న జేఏసి చైర్మన్ తేలుకుంట సతీష్ గుప్త తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 22 ప్రభాతవార్త:** ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంలో రాజీవ్ రహదారిలో 200 అడుగులకు విస్తరించాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ అసోసియేషన్ జేఏసి కన్వీనర్ తేలుకుంట సతీష్ గుప్త ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం 6వ వార్డు కౌశలయ్య ఎస్టేట్‌లోని అమరావతి క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై రాజీవ్ రహదారి ప్రధాన రోడ్డు మార్గంలో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంలో స్థలాలను కోల్పోతున్న బాధితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా జేఏసి చైర్మన్ తేలుకుంట సతీష్ గుప్త మాట్లాడుతూ టీ.డి. ఆర్.తో సంబంధం లేకుండా బాధితులకు ప్రత్యామ్నాయంగా కోల్పోయిన ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ రాజీవ్ రహదారిలో స్థలాలను కోల్పోతున్న బాధితులకు నష్టం జరుగకుండా ఉండేందుకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తెచ్చి బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసి యేషన్ ప్రతినిధులు కొమురవెల్లి వెంకన్న, రాము, ప్రవీన్, కృష్ణమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా బిసిల సమరభేరిని విజయవంతం చేద్దాం

-బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య



సమావేశంలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

**ముషీరాబాద్, నవంబర్ 22, ప్రభాతవార్త:** బీసీలకు రావల్సిన వాటాలను సాధించుకునేందుకు ఈనెల 25న చేపడుతున్న బీసీల సమరభేరిలో పార్టీలకు అతీతంగా బీసీలందరం పాల్గొని, విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనకు స్వతంత్ర్యం వచ్చి సంవత్సరాలు గడిచిపోతున్నప్పటికీ బీసీలకు మాత్రం ఇంకా అన్యాయం జరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సంపద సృష్టించే బీసీలకు ఏ రంగంలో కూడా సరియైన వాటా లేదని, బీసీలకు విద్య, ఉద్యోగ రంగాలతో పాటు రాజకీయ రంగంలోకూడా బీసీ జనాభా దామాషా ప్రకారం సమాన వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ నుండే పోరాటం ప్రారంభం కావాలని, పోరాడకపోతే ఎప్పటికీ బానిసలుగానే ఉండిపోతామని అన్నారు. బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా చూడటం మానుకోవాలని, బీసీలలో చైతన్యం వచ్చిందని, ఇప్పటి వరకు బీసీ హక్కులకై పోరాడి అనేకం సాధించామని గుర్తుచేశారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేట్ రంగంలో ఎస్సీ ఎస్టీ బీసీలకు రిజర్వేషన్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న బీసీల సమరభేరికి బీసీ ఉద్యోగులు, నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థులు, బీసీ సంఘాల నేతలు అందరూ పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. గుజ్జకృష్ణ మాట్లాడుతూ 75 కోట్ల జనాభా ఉన్న బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ లేకపోవటం విచారకరమని అన్నారు. బీసీలకు బడ్జెట్ కేటాయింపులో కూడా తీవ్ర అన్యాయం జరుగుతోందని, బీసీల సంక్షేమానికి రెండు లక్షల కోట్లు బడ్జెట్ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీల హక్కుల సాధనకై ఈనెల 25న జరుగబోయే సమరభేరిలో బీసీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు నీల వెంకటేష్, నంద గోపాల్, లాల్ కృష్ణ, సుధాకర్, నిమ్మల వీరన్న, అనంతయ్య, రఘుపతి, లక్ష్మీనారాయణ, రాజేందర్, బాలయ్య, హేమంత్, నిఖిల్, ఉదయ్‌నేత తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మదనం గంగాధర్‌కు అవకాశం ఇవ్వాలి

-ఎస్సీ 57 ఉపకులాల ఐక్య వేదిక అధ్యక్షులు చింతల రాజలింగం



సమావేశంలో మాట్లాడుతున్న 57 ఎస్సీ కులాల ఐక్య వేదిక అధ్యక్షులు చింతల రాజలింగం

**ముషీరాబాద్, నవంబర్ 22, ప్రభాతవార్త:** డీఎస్పీ ఉద్యోగాన్ని వదులుకుని ప్రజా సేవకై వస్తున్న మదనం గంగాధర్‌కు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవకాశం ఇవ్వాలని ఎస్సీ 57 ఉపకులాల ఐక్యవేదిక అధ్యక్షులు చింతల రాజలింగం విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మదనం గంగాధర్‌కు మద్దతుగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజలింగం మాట్లాడుతూ ఎంతో పేదరికంలో ఉన్న సంచార కుటుంబంలో పుట్టిన గంగాధర్ ఎంతో కష్టపడి డీఎస్పీ స్థాయికి వచ్చారని, అటువంటి వ్యక్తికి పేదల కష్టాలు బాగా తెలుస్తాయి కాబట్టి అటువంటి వ్యక్తి ఎమ్మెల్సీ అయితే బడుగు బలహీన వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్సీలు అంటే కేవలం మాల మాదిగలు మాత్రమే కాదని, 57 ఉప కులాలు కూడా ఉన్నాయని, వారికి కూడా చట్టసభలలోకి వచ్చే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ఎవరిని నిలబెట్టినా ఉపకులాలందరూ మద్దతు ఇచ్చి గెలిపించామని గుర్తు చేశారు. ప్రస్తుతం నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న మదనం గంగాధర్ ఎన్నో ఉత్తమ గుణాలు కలిగి ఉండటమే కాకుండా ఎంతో సమర్థత కలిగిన వ్యక్తిగా ప్రజాదరణ పొందారని తెలిపారు. ప్రస్తుత రాజకీయాలలో యువత అవసరం చాలా ఉంది కాబట్టి, ప్రజా సేవకై తన ఉద్యోగాన్ని సైతం త్యాగం చేసి వస్తున్న గంగాధర్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించుకుందామని, ఆయన గెలుపే మనందరి గెలుపుగా ప్రకటించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉప కుల సంఘాల నాయకులు బి.మంగేష్, నేతకాని సంజయ్, బైళ్ల సమాజం యాదన్న, శంకర్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

### దళిత జర్నలిస్టుపై దాడి చేసిన నిందితులపై చర్యలు తీసుకోండి

**రాష్ట్ర ఎస్సి,ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**దుండిగల్, నవంబర్ 22 ప్రభాతవార్త:** ప్రభుత్వ భూఆక్రమణలపై కథనాలు రాసిన సీనియర్ జర్నలిస్టు మద్దయ్యపై దాడి చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సి,ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య డిసిపి, ఎసిపిలను ఆదేశించారు. దళిత జర్నలిస్టు మద్దయ్యపై జరిగిన దాడి చేసిన ఘటనకు సంబంధించి విషయాన్ని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, మలామహానాడు నాయకులు బొట్టు నర్సింగ్‌రావులు ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర ఎస్సి,ఎస్టి కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఫోన్‌లో వివరించారు. తక్షణమే స్పందించిన ఆయన మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి, ఎసిపి శ్రీనివాస్‌రెడ్డిలకు ఫోన్ చేసి ఘటనపై ఆరా తీశారు. నిందితులపై ఎస్సి,ఎస్టి అట్రాసిటి చట్టం కింది కేసులు నమోదు చేయాలని కోరారు. ఈమేరకు డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా, గండిమైసమ్మదుండిగల్ మండల పరిధిలోని ప్రభుత్వ భూములను, చెరువులను ఆక్రమించి వెంచర్లు వేస్తున్న త్రిపుర ల్యాండ్ మార్క్ నిర్మాణ సంస్థపై వార్త కథనాలు రాసిన మద్దయ్య దాడి చేయడం సిగ్గుచేటు అన్నారు. సామూహిక దాడికి పాల్పడిన త్రిపుర ల్యాండ్ మార్క్ నిర్వాహకులు పసుపులేటి సుధాకర్, వంపుగూడేం బాల్‌రెడ్డి, వంపుగూడేం ప్రశాంత్‌రెడ్డి, చిన్నారెడ్డి, భూపాల్‌రెడ్డి, వెంకట్ తదితరులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రభు త్వ స్థలాలను పరిరక్షణ కొరకు ఆక్రమణలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టు మద్దయ్యకు రక్షణ కల్పించాలని కోరారు.

### మెరుగైన వైద్యానికి సిఎంఆర్ఎఫ్ ఎంతో మేలు : ఎమ్మెల్యే శ్రీగణేష్



పికెట్‌లో సిఎంఆర్.ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 22 ప్రభాతవార్త:** అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలకు కార్పోరేట్ ఆసుపత్రులలో వైద్యం చేయించుకునేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధి ఎంతో గానో ఉపయోగపడుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శుక్రవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్య మంత్రి సహాయ నిధి కింద మంజూరైన సిఎం.ఆర్.ఎఫ్.చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం సిఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, కా ంగ్రెస్ నాయకులు తేలు కుంట సతీష్ గుప్త, రేపాల వెంకటేశ్వర్లు, సి.సంతోష్ యాదవ్, గుజ నాగేందర్ యాదవ్, నాగినేని సరిత, బల్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పెద్దనాన్నపై దాడి చేసిన ముగ్గురి అరెస్టు

**కంటోన్మెంట్,నవంబర్ 22 ప్రభావార్త:** తల్లితో గొడవపడుతున్న ఓ ఇద్దరి కొడుకులను పెద్దనాన్న మంద లించినందుకు మా కుటుంబంలో ఎందుకు జోక్యం చేసుకుంటున్నావని పెద్దనాన్నపై బ్లేడ్‌తో గాయ పర్చిన ముగ్గురిని తుకారాంగేట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం అడ్డగుట్టలో నివాసం ఉంటున్న బుచ్చమ్మ కుమారులు మల్లికార్జున్, రాఖేశ్‌లు ఈ నెల 21 గురువారం రాత్రి తండ్రి దశదిన కర్మలో తాగిన మత్తులో తల్లితో గొడవపడుతు న్నారు. విషయం తెలుసుకున్న పెద్దనాన్న శ్రీనివాస్ అమ్మను ఎందుకు కొడుతున్నారు. ఎందుకు తిడుతున్నా రని మందలించినందుకు మల్లికార్జున్ ఇంట్లో ఉన్న పేపర్లను కట్ చేసే బ్లేడ్‌తో కడుపు భాగంలో కోశాడు. తీవ్రగాయాలపాలైన శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు మల్లికార్జున్, రాఖేశ్, తల్లి బుచ్చమ్మలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆధ్వర్యంలో ఎస్.ఐ.కిరణ్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

### ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి : ఎమ్మెల్యే తలసాని



సిఎం.ఆర్.ఎఫ్.చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 22 ప్రభాతవార్త:** ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో రాంగోపాల్ పేట్, బేగంపేట్ డివిజన్లకు చెందిన 7 మందికి మంజూరైన సిఎం.ఆర్.ఎఫ్.చెక్కులను తలసాని చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమైన సమస్యలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్యపరీక్షలు చేయించుకొని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ అత్తెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు శ్రీహరి, కిషోర్, అంజనేయులు, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### జీవితాంతం పేదలకు అన్నదానం చేస్తా : ముజీబ్‌హుస్సేనీ



క్యాన్సర్ ఆసుపత్రి వద్ద రోగుల సహాయకులకు అన్నదానం చేస్తున్న టిఎన్‌జిఒ కేంద్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ

**బేగంబజార్,నవంబర్ 22ప్రభాతవార్త:** అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, టిఎన్‌జిఒ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ ఆధ్వర్యంలో క్యాన్సర్ ఆసుపత్రి వద్ద రోగుల సహాయకులకు సయ్యద్ జమాల్ జహంగీర్‌తో కలిసి అన్నదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలోఫర్, క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం రోగుల వెంట వచ్చే రోగిసహాయకులకు ప్రతినెల నాలుగు వారాలు అన్నదానం చేయడం జరుగుతుందన్నారు. వారికి అన్న దానం ద్వారా చేసే అదృష్టం దేవుడు ఇచ్చినట్లు తెలిపారు. బతికినంత కాలం అన్నదానం సేవ చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో ఎన్.ఆర్.ఐ మిత్రులు ముబారజుద్దీన్, ముజాహిద్, సయ్యద్ అసదుద్దీన్, హైదరాబాద్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు కె.ఆర్ రాజ్ కుమార్, కుర్రాడి శ్రీనివాస్, బి.శివకుమార్, మహ్మద్ వహిద్, వైదిక్‌శాస్త్రి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు వాయుసేనపై అవగాహన



**పేట్ బషీరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త**

సెయింట్ ఆంథోనీ జూనియర్ కాలేజీలో భారత దేశ డిఫెన్స్ వాయు వింగ్ కమాండర్ గురు ప్రీతి విచ్చేసి విద్యార్థుల కు వాయుసేన గురుంచి వివరించారు. వాయుసేనలో చేరడానికి కనీస అర్హతలు, అగ్నిపత్ గురించి క్లుప్తంగా వివరించారు. విద్యార్థులు వాయు సేనాలో చేరడానికి మోటివేషన్ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి సిహెచ్. ప్రభాకర్, వాయు వింగ్ కమాండర్ సందీప్, ప్రొఫెసర్ ఫాదర్ విన్సంట్, కాలేజీ డైరెక్టర్ నరిశెట్టి సుందర రాజు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై రాష్ట్రంలో ఆర్డినెన్స్ జారీ చేయాలి



మాదిగ ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్లో బిల్లు ఆమోదం చేయాలని దీక్ష చేపట్టిన మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్ మాదిగ

**హైదరాబాద్, నవంబరు 22 ప్రభాతవార్త**

మాదిగ ఎస్సీ వర్గీకరణ కై ఆర్టికల్ 341 ని సవరిస్తూ పార్లమెంట్లో బిల్లు ఆమోదం చేయాలని తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం బర్కత్‌పురలోని సామాజిక భవన్ మహా కూటమి రాష్ట్ర కార్యాలయంలో ఆయన దండోరా ధర్మపోరాట ఆమరణ నిరాహార దీక్ష రెండవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టుగా తీర్పును గౌరవిస్తూ రాష్ట్రంలో ఆర్డినెన్స్ జారీ చేయాలని, కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు అమలుపరిచే వరకు, ఈ ఆమరణ నిరాహార దీక్ష కొనసాగుతుందని తెలిపారు. కాగా, మహా కూటమి చైర్మన్ పోకల కిరణ్ మాదిగ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు పలు సంఘాలు సంఘీభావం తెలిపారు. మహా కూటమి చైర్మన్ పోకల కిరణ్ మాదిగ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు పలు సంఘాలు సంఘీభావం తెలిపాయి. మహా కూటమి ప్రధాన సలహాదారులు సంగీత రాజలింగం, మాదిగ కార్మిక సంఘాల జేఏసీ అధ్యక్షులు గొల్లపల్లి దయానందరావు. మూచి సంగార రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణ్ ప్రేమ్ రాజ్, బీసీ సంక్షేమ సంఘం దక్షిణ రాష్ట్రాల అధ్యక్షులు దక్షిణ రాష్ట్రాల అధ్యక్షులు పుట్ట జంగన్న గౌడ్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు కొప్పుల వినోద్ కుమార్, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ స్టేట్ చైర్మన్ నల్ల సూర్యప్రకాష్, తెలంగాణ ఉద్యమ వేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ పోరాటాల రామన్న మాదిగ, దళిత హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుంజర్ల సుధాకర్ మాదిగ, తెలంగాణ అడ్వకేట్ జెఏసి స్టేట్ ప్రెసిడెంట్ నాగుల శ్రీనివాస్ యాదవ్, సామాజికవేత్త, డాక్టర్ నరుణ్, అరుంధతి సేవ మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు మేకల నారాయణ, సంఘీభావం తెలిపారు, ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి వెంకటయ్య, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మురళీ మాదిగ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఇరిగిరాల భాస్కర్ మాదిగ, గ్రేటర్ హైదరాబాద్ ఇన్‌చార్జి కుంద్రు రాజు మాదిగ, హైదరాబాద్ అధ్యక్షులు బాల స్వామి మాదిగ, మాదిగ సంఘాల మహా కూటమి కళామండలి విభాగ అధ్యక్షులు ఎస్ లింగయ్య మాదిగ, బిఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సునీల్, నల్గొండ జిల్లా ఇంచార్జ్ ధర్మపురం శ్రీనివాస్ మాదిగ, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణారావు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

### షక్కర్ గంజ్ ఫీడర్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చార్మినార్, నవంబరు 22 ప్రభాతవార్త :**

విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 23వ తేదీ శనివారం ఉదయం 10 నుంచి 1 గంట వరకు షంషేర్ గంజ్ ఫీడర్ పరిధిలో, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటలు వరకు రూప్‌లాల్ బజార్, షక్కర్‌గంజ్, లాల్‌దర్వాజ చౌరస్తా, శాలిబండ పోస్టాఫీస్ కార్యాలయం ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు చార్మినార్ సిబిడి ఎడిఇ మహ్మద్ అక్బర్ తెలిపారు.

### క్లినిక్‌ను ప్రారంభించిన డిప్యూటీ మేయర్, కార్పొరేటర్

**నిజాంపేట్, నవంబర్ 22, ప్రభాతవార్త**

నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో బండారి లేఔట్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన రమేష్ క్లినిక్స్‌ను నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్ జ్యోతి నర్సింహా రెడ్డి, డా.ఎర్రబోతు రమేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ నూతన పరిజ్ఞానం అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన రమేష్ క్లినిక్స్ ప్రేమే లక్ష్యంగా సేవయే మార్గంగా మంచి పేరును గడించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బండారి లేఔట్ ప్రెసిడెంట్ నర్సింహా రెడ్డి, 27 వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ బాబు, మహిళా నాయకులు లక్ష్మీ కుమారి, సోమేశ్వరి, డా.ఎర్రబోతు రమేష్ వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


వార్త VAARTHA CLASSIFIEDS — CLASSIFIEDS — వార్త VAARTHA CLASSIFIEDS

**LOST AND FOUND**

★ I, **KOTAGIRI SWAPNA** Lost my Passport No.Z4028957 in previous name CHITTIPROLU SWAPNA RANI D/O GANGISHETTY VENKATESHAM nr Ganesh Nagar Ramanthapur. Cal **8885365316.**
**(Ro.No.32075)**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II, TRIVENI COMPLEX, 1ST FLOOR, ABIDS, HYDERABAD**
**O.A. No. 413 OF 2024**

**Between:**
**M/s Bank of Baroda, Ameerpet Branch Situate at #No.6 & 7, D.No.6-3-853/1, Meridian Plaza Ameerpet, Hyderabad, Telangana-500 016, Rep. by its Branch Manager ...APPLICANT**
**AND**
**Mrs. Asma Begum, C/o Sri Mubarak Bin Mohammed, Aged 34 years Occ: Business, R/o Plot No.9 Sy No /A, Sough Bowli, Upper Pally, K V Rangareddy, Telangana -500 048. ....DEFENDANT**

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

**To,**
**Mrs. Asma Begum, C/o Sri Mubarak Bin Mohammed, Aged 34 years Occ: Business R/o Plot No.9Sy No /A, Sough Bowli, Upper Pally, K V Rangareddy, Telangana -500 048. ....Defendants**

Please take summon in the above OA No. 413 of 2024 filed by Bank of Baroda, Ameerpet Branch before the DRT-II, Hyderabad for recovery of **Rs. 29,33,667/-** (Rupees Twenty Nine Lakhs Thirty Three Thousand Six Hundred and Sixty Seven only) against the Defendant. The Hon'ble Tribunal ordered summons to the Defendant by way of paper publication in "VARTHA" Telugu Daily newspaper and posted the same on 24-12-2024.

In accordance with Sub-Section 4 of Section 19 of the Act, you the Defendants are directed as under:

i) To show cause within 30 days of the service of summons as to why relief prayed for should not be granted.

ii) To disclose particulars of assets other than properties and assets specified by Applicant under serial number 3A of the Original Application.

iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the Original Application, pending hearing and disposal of the application for attachment of properties.

iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in ordinary course of his business, any other assets over which security interest is created and/or other assets and properties specified by applicant under serial number 3A of the Original Application without the prior approval of the Tribunal.

v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with Bank or Financial Institutions holding security interest over such assets.

You are hereby required to show cause on 24-12-2024 at 10:30 Am at Debts Recovery Tribunal-II Hyderabad, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.

Take Notice that in case of default the Application will be heard and determined in your absence.

Given under my hand and seal of the Tribunal on this day of the 20th day of November 2024.

**// By Order of the Tribunal//**
**REGISTRAR**
**Debt Recovery Tribunal-II, Hyderabad.**

**BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL-I, AT HYDERABAD**
**O.A.No.319 of 2024**

BETWEEN:
**Bank of Baroda,** ROSAR Branch, Basheerbagh Hyderabad Rep. by its Chief Manager **...APPLICANT**
AND
**Mrs. Ragula Kavitha & others ...DEFENDANTS**

To
1. **Mrs. Ragula Kavitha** w/o. Mr. Ragula Venkatesh, Female, aged 48 years, Flat.No.508, 5th floor, BNR Apartments, Pillar No.123, Attapur Road, B/H westside Showroom, Hyderabad-500 048
2. **Mr. Ragula Venkatesh** s/o. Sri. R. Yadaiah, Male, aged major Flat No.508, 5th floor, BNR Apartments, Pillar No.123, Attapur Road, B/H westside Showroom, Hyderabad-500 048

Please take notice that the above O.A. is filed for recovery of money of Rs.57,02,812.60 against you and the same is posted to **20.12.2024 at 10.30 a.m.** for your appearance. You may appear either in person or through an advocate before the said court on the said date, failing which, the matter will be decided ex-parte.

(By order of the Hon'ble DRT)
**Sd/- SRINIVAS CHITTURU**
**ADVOCATE**
3-4-533, BARKATPURA
HYDERABAD-500 027.
**COUNSEL FOR APPLICANT**

**IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT: AT HYDERABAD**
**O.S.NO. 31 OF 2022**

Between:
**Akula Naveen ....Plaintiff**
And
**Vejendla Kiran Kumar ....Defendant**

To,
**Vejendla Kiran Kumar** S/o. Muktheswar, Occ: Pvt. Employee, R/o. H.No. 2-22-35/1, G-2, Gayatri residency, Eenadu Colony, Kukatpally, Hyderabad. **....Defendant**

That the Plaintiff has filed the above suit for specific performance of Agreement of Sale, dt. 04/09/2017, in respect of suit schedule property against you and the said matter is posted to **03/12/2024** for your appearance. You are hereby directed to appear before this Hon'ble Court on the above said date at 10.30 AM either in person or through your counsel failing which the matter will be decided in your absence as per law.

(BY ORDER OF THE HONOURABLE COURT)
**Sd/- P. NAVEEN KUMAR**
**Advocate**
Plot No.4,
Sheshachala Colony,
West Marredpally,
Secunderabad.
**Ph: 9989775555**

**IN THE COURT OF THE HONBLE III ADDL. JUNIOR CIVIL JUDGE AT :: MALKAJGIRI**
**O.S. No. 1111 OF 2024**

**BETWEEN:**
1. Bhoompally Praveen Kumar and Others **... PLANTIFFS**
**AND**
1. THE MANDAL REVENUE OFFICER Malkajgiri Mandal,
2. ALL CONCERNED **...DEFENDANTS**

The above named Plaintiffs have filed the above Original Suit bearing O.S.No.1111 of 2024 on the file of the HON'BLE IN THE COURT OF THE HONBLE III Addl. JUNIOR CIVIL COURT. Malkajgiri, under Suit for declaration to declare the plaintiffs 1 to 3 as legal heirs of the deceased i.e., Late.BhoompallyJyothi, Please take notice that the above original suit stands posted to 12/12/2024 for appearance of interest persons and please take notice that the concerned are required to appear before the Hon'ble Court on or before 12/12/2024 and in case of default to appear in person or through counsel, the above suit will be heard and determined in absence.

**(BY ORDER OF THE HON'BLE COURT)**
**Sd/- V.Y.DAS**
Advocate
Flat No.105,
Ameer Estate,
S.R.Nagar, Hyderabad.

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR (FAC) AT: RED HILLS, HYDERABAD**
**DIS/ARB/CF.No.460 of 2024**

**Between: -**
**M/s.Neeladri Chit Fund Private Limited.,** #1-2-597/2, Baraf Bagh Colony, Domalguda, Hyderabad - 500 029, Represented by its Legal Asst Manager P.Sadashiva Reddy **...Disputant**
**AND**
01. Sri.Praveen Kumar Kannaiah, S/o.Sri Kannaiah, aged about 36 years, Occ:Business, R/o.H.No.11-1-2/P14, Samatha Nagar Colony, Near Sanath Nagar Railway Station, Balanagar, Hyderabad-500 018.
02. Sri.Rachanna Gangadari, S/o. Sri.G.Anantha Ram, aged about 26 years, Occ:Business, R/o.H.No.2-77, Badampet, Zaheerabad HO, Sanga Reddy Medak -502 220
03. Sri.Sravan Kumar Ranganath, S/o. Sri.R.Narayana, aged about 30 years, Occ:Business, R/o.H.No.3-37-879/B, Jagathriri Nagar Colony, Near CSI Wesly Church, Jagathririgutta, R R Dist-500 037.
04. Sri.Sheik Rafeeq, S/o.Sri.Shafi Sheik, aged about 34 years, Occ: Pvt Emp, M/s.Diyar United Private Limited, design:Cyber Security Data Analyst, EMP Number :3658, Dept:Cyber Security Operations Center(CSoC)508-ISD, R/o.H.No.2-2-215/15/33/1, Street No.3, Roayal Enclave, Macha Bollaram, Near Halika Homes, Alwal, Hyderabad - 500 010. O/o.Diyar United Private Limited, Mahaveer Techno Par, 5th floor (Easter Part), Plot No.6, Survey No.64, TSIIC Layout, Near Raheja "C" Gate, Hi-Tech City, Hyderabad - 500081.
05. Smt.Rajitha Bairaf, W/o.Sri. K.Praveen Kumar, aged about 30 years, R/o.H.No.11-1-2/P 14, Samatha Nagar Colony, Sanatha Nagar, IESO, Balanagar, Hyderabad -500 018. **...Opponents**

Please take notice that the above dispute is filed against you for Recovery ofRs.6,92,630/-and the same is posted on 30-11-2024for your appearance before the office of Deputy Registrar of Chits/ Arbitrator, District Registrar Office,H.No:11-5-338, Near Niloufer Hospital, Red Hills, Hyderabad at 11.00 A.M. if you fail to attend the office of Deputy Registrar of Chits/ Arbitrator (FAC) on that day the matter will be heard and decided ex-parte.

**(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR (FAC))**
**B. JANAKIRAMULU @ JK**
Advocate
Counsel for Disputant

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR (FAC) AT: RED HILLS, HYDERABAD**
**DIS/ARB/CF.No.466 of 2024**

**Between:-**
**M/s.Neeladri Chit Fund Private Limited.,** #1-2-597/2, Baraf Bagh Colony, Domalguda, Hyderabad - 500 029, Represented by its Legal Asst Manager P.Sadashiva Reddy **...Disputant**
**AND**
01. M/s.Glam World, Rep by its Proprietor Smt. Meena Rishab Jain, D/o.Sri.Jaikishan Chandak, W/o. Sri. Rishab Jain, aged about 41 years Occ:-Business, Desig; Proprietor, O/o.M/s. Glam World, Ground Floor, Shop No:1-8-216/19A, 1-8-216/16, Prenderghast Road,( PG-Road), Opp:Dimmy Pan Shop, Sindhi Colony, Secunderabad - 500 030. And also R/o.#Flat No.303, Plot No16,17, Khushi Chandralu Residency, Near Jain Mandir, Margadarshini Colony(Mandarshini Colony), Rasoolpura, Secunderabad - 500003.
02. Sri.Rishab Mangilal Jain, S/o. Sri.Mangilala Jain, aged about 44 years, Occ:Business, M/s.Aarya Architecture Solutions, Desig:Proprietor, R/o.#Plot No16,17, 303,Khushi Chandrala Residency, Margadrishini Colony, (Man darshini Colony) Rasoolpura, Secunderabad - 500003. And also at: M/s. Aarya Architecture Solutions, Ground Floor, 7/A/1, Behind Usha Divisional Office, Rasoolpura, Secunderabad, Hyderabad -500003.And also R/o.H.No.7-A-1, Aadarsh Nagar, Rasoolpura, Secunderabad - 500 003.
03. Sri.Manoj Kumar Satyana rayana Mundhra, S/o. Sri. M.Satyanarayana, aged about 51 years, Occ: Business, , R/o.H.No.7-A, Chaya Chitra, Spring Velly, Rasoolpura, Secunderabad - 500 033. And also R/o.H.No.301,Jugnidhi Aparments, Plot No.10, Margadrishini Colony, Rasoolpura, Secunderabad -500003. And also R/o.#Flat No.303, Plot No16,17, Khushi Chandralu Residency, Near Jain Mandir, Margadrishini Colony (Mandarshini Colony), Rasoolpura, Secunderabad - 500003. And also at:19/23, 2nd Floor, Vithoba Lane, Surat City, Surat, 11-Gujarat-395010. And also at:19/304, Priyanka Intercity, Opp:Bhakti Dham Mandir, Surat City, Surat, 11-Gujarat-395010. And also AT:#103, A-5, Model Town Regency, Saroli, Surat, Gujarat -395010.
04. Smt.Shanta Devi Manoj Kumar Mundra, W/o.Sri.Manoj Kumar Satyanarayana, aged about 47 years, R/o.1-8-216/19A, PG-Road, Opp:Dimmy Pan Shop, Sindhi Colony, Secunderabad - 500 030. And also R/o.Flat No.303, Plot No.16&17, Khushi Chandralu Residency, Margadarshini Colony, Rasoolpura, Secunderabad, Hyderabad - 500003. And also at:# 301, Jugnidhi Aparments, Plot No. 10, Margadrishini Colony, Rasoolpura, Secunderabad -500003. And also at:H.No:19/304, Priyanka Intercity, Opp:Bhakti Dham Mandir, Puna Patiya Magob, Surat City, Surat, 11-Gujarat -395010. And also at:H.No.A-3,804, Model Town Regency, Saroli, Surat, Gujarat -395010.
05.Sri.Manoj Kumar Dangra, S/o.Sri.D.Mahendra Kumar, Occ:Business, M/s.Pitru Krupa Kanch Ghar Industries, Desig:Partner, #7-228/45, United Building Lane, Paradise Circle, Chandra Nagar Colony, Rasoolpura, Secunderabad -500 003. #Plot No.2-2-3-560/2, Gagan Paradise, Minister Road, Secunderabad - 500 003. **...Opponents**

Please take notice that the above dispute is filed against you for Recovery ofRs.5,69,292/- and the same is posted on 30-11-2024for your appearance before the office of Deputy Registrar of Chits/ Arbitrator, District Registrar Office,H.No:11-5-338, Near Niloufer Hospital, Red Hills, Hyderabad at 11.00 A.M. if you fail to attend the office of Deputy Registrar of Chits/ Arbitrator(FAC) on that day the matter will be heard and decided ex-parte.

**(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR (FAC))**
**B. JANAKIRAMULU @ JK**
Advocate
Counsel for Disputant

## డ్రైనేజీ ఔట్ లెట్ నిర్మాణం కోసం చర్యలు


డ్రైనేజీ ఔట్లెట్ నిర్మాణం గురించి అధికారుల చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**వనస్థలిపురం. నవంబర్.22.ప్రభాతవార్త :** బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ శివారు కాలనీల డ్రైనేజీ అవుట్ లెట్ కోసం సాహెబ్ నగర్ గ్రామ రైతులతో తన కార్యాలయంలో వారం రోజుల క్రితం ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సమావేశం నిర్వహించారు. దానిలో భాగంగా రెండు రోజుల క్రితం ఎల్.బి.నగర్ జోన్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ యాదవ్ మరియు టౌన్ ప్లానింగ్ ఏ.సీ.పీ.శ్యామ్సాన్ తో తన కార్యాలయానికి పిలిపించడం జరిగింది.దానికి అనుగుణంగా శుక్రవారం ఇరిగేషన్ అధికారులచే మరోసారి తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.... ట్రంక్ లైన్ కోసం మలివిడత దాదాపు 2 కోట్ల రూపాయలు మంజూరు చేయించడం జరిగిందని, కాంట్రాక్టర్ కూడా ట్రంక్ లైన్ పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారు కాబట్టి మరోసారి రాచకాలువ మొత్తం సర్వే చేయించి,యుద్ధ ప్రాతిపదికన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రాచకాలువ సర్వే త్వరగా పూర్తి చేసి వచ్చే వర్షాకాలం లోపు ట్రంక్ లైన్ పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గారు ఆదేశించారు.ఇట్టి కార్యక్రమంలో భారాస పార్టీ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,ఇరిగేషన్ అధికారులు శుక్లాజ,సతీష్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యత ప్రమాణాలతో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలి : లచ్చిరెడ్డి


సి.సి.రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం నవంబర్.22.ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్ఎఫ్ కాలనీలో జరుగుతున్న నూతన రోడ్డు నిర్మాణం పనులను బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి జిహెచ్ఎంసి డిఈ దామోదర్ రావు తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ....రోడ్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, లెవెల్స్ సరి చూసుకుంటూ రాబోవు కాలంలో కాలనీ వాసులకి ఏలాంటి ఇబ్బందులు కలగకుండా వీలైనంత త్వరగా రోడ్ నిర్మాణం పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఎఈ రాజ్ కుమార్, కాలనీ సభ్యులు దామోదర్ రెడ్డి, కృష్ణ, మధుకర్ రెడ్డి మరియు పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా తీరిబ్రీ సెక్రటరీ పవన్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

## గౌతమ్ నగర్ డివిజన్లో మంచినీటి సమస్యలు మెరుగుపరచాలని వినతి



**మల్కాజిగిరి నవంబరు22,ప్రభాతవార్త :** గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని పలు బస్తీలలో మంచినీటి సమస్యను మెరుగుపరచాలని కోరుతూ మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు ఖైరతాబాద్ లోని జలమండలి ఎండి అశోక్ రెడ్డిని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ కలిశారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవులు మారేడ్పల్లి జిఎం వినోద్ కుమార్ ను నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ కలవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్, జయగిరి లక్ష్మీ నరసింహస్వామి నగర్, న్యూ వెంకటేశ్వర నగర్, హిల్ టాప్ కాలనీ, రామాంజనేయ నగర్, బిహారి బస్తీ, తదితర ప్రాంతాలలో వారానికి ఒకసారి మంచినీటి సరఫరా అవుతుందని దానివల్ల గుక్కెడు నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. దీనికి స్పందించిన ఖైరతాబాద్ జలమండలి ఎండి అశోక్ రెడ్డి, అలాగే మారేడ్పల్లి జిఎం వినోద్ కుమార్, డీజీఎం విద్యాసాగర్లు ఒక వారం రోజుల లో మంచినీటి ఎద్దడిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు మరియు మహిళా నాయకురాలు మరియు బస్తివాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

**: చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు**


చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వర రావును సన్మానిస్తున్న రాం కోటేశ్వరరావు, చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట్ నవంబర్ 22, ప్రభాతవార్త :** టిడిపి తోనే అభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాల సంస్థ చైర్మన్ గా నియమితులైన మలక్ పేటకు చెందిన గోనుగుంట్ల కోటేశ్వరరావు మలక్ పేట కు విచ్చేయడంతో మలక్ పేట మున్సిపల్ కాలనీలోని సాయిబాబా దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ వేమూరి రామ్ కోటేశ్వరరావు ఆయనకు పుష్పగుచ్చాను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా గోనుగుంట్ల కోటేశ్వరరావు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ మలక్ పేటకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాల సంస్థ చైర్మన్ గా నియమించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్, పోచమ్మ దేవాలయం ట్రస్టీ పిటి శంకర్ ముదిరాజ్, నాయకులు నరేందర్ , చేగిరెడ్డి మదన్ , సునీల్, మణికొండ వెంకటేశ్వరరావు, ఎస్. మనోహర్ ద్వారక్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# వి.యం.హోంలో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలి


కోదండరాంకు వినతి పత్రం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

**హుడాకాంప్లెక్స్, 22 నవంబరు ప్రభావార్త:** అనాథ పిల్లలకు పదవతరగతి తర్వాత చదవడానికి హాస్టల్ తో కూడిన ఇంటర్, డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ వి.యం.హోం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంని శుక్రవారం కలవడం జరిగింది. ఈ సంధర్భంగా వి.యంహోం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు భీమగాని మహేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని అనాధ పిల్లలు పదవతరగతి వరకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వి.యం. హోం లో చదువుతున్నా , హోం నుంచి అర్ధాంతరంగా బయటకు పంపడంతో అనాథ పిల్లలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని చెప్పారు. ఇంటర్ కళాశాల లేక చదువులు మధ్యలో ఆపేసి కార్మికులుగా మారడం ఆలనాపాలనా లేకుండా రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గతంలో వి.యం.హోం పరిరక్షణకు కృషి చేసిన కోదండరాం ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకుని వెళ్లి పరిష్కారించాలని కోరారు. వి.యం.హోం లో పర్మినెంట్ టీచర్ ఒక్కరే ఉండటంతో విద్యార్థుల చదువు ప్రశ్నార్థకంగా మారిందని,విద్యా ప్రమాణాలు ఉంటడం లేదని వెంటనే పర్మినెంట్ టీచర్లను నియమించాలని కోరారు. వి.యం. హోం ఎగ్జిక్యూటివ్ కమిటీలో పూర్వ విద్యార్థుల ప్రాతినిధ్యం ఉంటే అనాథ పిల్లలకు మరింత సేవ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కాంట్రాక్టు టీచర్ల నియమాకాలలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని కోరారు. వి.యం.హోం లో వృత్తి విద్యా కోర్సులు వెంటనే ప్రారంభించేలా చుడాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం గారిని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో వి.యం.హోం పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షుడు కేతావత్ సాగర్, భాస్కర్, గణేష్,విఠల్, మల్లేష్, అశోక్ తో పాటు టిజెఎస్ రాష్ట్ర కార్యదర్శి పల్లె వినయ్ కుమార్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కె.వి.రంగారెడ్డి,కొత్త రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం : చైర్మన్ చేకోలేకార్ లక్ష్మీ


చైర్మన్ చెకోలేకార్ లక్ష్మీని సన్మానిస్తున్న వ్యాపారస్తులు దేవర రాజేశ్వర్, దడువై రాఘవేందర్, కట్ట మల్లేశం తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 22, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునికరిస్తామని చైర్మన్ చేకోలేకార్ లక్ష్మీ పేర్కొన్నారు .హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన చేకోలేకర్ లక్ష్మిని మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ మాజీ అధ్యక్షులు దేవర రాజేశ్వర్, ఏపీ గ్రేయిన్స్ అండ్ సీడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు దడువై రాఘవేందర్, సలహాదారులు కట్ట మల్లేశం లతోపాటు పలువురు వ్యాపారస్తులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలని అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్లలో నెలకొన్న సమస్యల గురించి వారు చైర్మన్ చేకోలేకార్ లక్ష్మి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆమె స్పందించి మార్కెట్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మార్కెట్లను అభివృద్ధి చేయడంలో వ్యాపారస్తులు తమ సలహాలు, సూచనలను అందజేసి మార్కెట్ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆరుగాలం శ్రమించి తాము పండించిన సరుకులను మార్కెట్టుకు తీసుకువచ్చే రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి మెరుగైన గిట్టుబాటు ధరను అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకార్ శ్రీనివాస్, వ్యాపారస్తులు కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో కోహెడలో మార్కెట్ నిర్మాణం : మార్కెటింగ్ శాఖ సంచాలకులు ఉదయ్కుమార్


చైర్మన్ మధుసూదన్రెడ్డితో కలిసి డీపీఆర్ను పరిశీలిస్తున్న సంచాలకులు ఉదయ్కుమార్

**అబ్దుల్లాపూర్మెట్, నవంబరు 22 ప్రభాతవార్త:** కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులు పి. ఉదయ్కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్రెడ్డి, పాలకవర్గ సభ్యులు, సంబంధిత అధికారులతో కలిసి కోహెడలో మార్కెట్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. మార్కెట్ నిర్మాణానికి సంబంధించి డీపీఆర్ను పరిశీలించి ఫేజ్-1 కింద చేపట్టే నిర్మాణాల వివరాలను అధికారులతో తెలుసుకున్నారు. అనంతరం పాలకవర్గంతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కోహెడలో నిర్మించనున్న మార్కెట్ను అంతర్జాతీయ ప్రమాణాలతో పూర్తిచేస్తామన్నారు. రైతులకు ఉపయోగపడేలా దక్షణ భారతదేశంలో అతిపెద్ద మార్కెట్హబ్గా తీర్చి దిద్దుతామన్నారు. సమీకృత మార్కెట్ను నిర్మించి దాని ద్వారా ఎగుమతులు, దిగుమతులను కొనసాగిస్తామన్నారు. మార్కెట్ నిర్మాణానికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, వ్యవసాయ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సమీక్షా సమావేశం కొనసాగనుందని వివరించారు. మార్కెట్ నిర్మాణానికి సంబంధించి అధికారులు, పాలకవర్గానికి పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్చైర్మన్ భాస్కరాచారి, డైరెక్టర్లు జైపాల్రెడ్డి, అంజయ్య, మచ్చేందర్రెడ్డి, రఘుపతిరెడ్డి, గణేష్నాయక్, బండి మధుసూదన్రావు, నవరాజ్, గోవర్ధన్రెడ్డి, వెంకట్గుప్త, ఇబ్రహీంతోపాటు మార్కెటింగ్ శాఖ అదనపు సంచాలకులు లక్ష్మణుడు, ప్రాంతీయ సంచాలకులు మల్లేశం, జిల్లా అధికారి రియాజ్, ఎస్ఈ లక్ష్మణ్గౌడ్,డీఈ రవీందర్,ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీని వాస్, మార్కెట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చిలుక నరసింహారెడ్డి పాల్గొన్నారు.

# హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల ముందు దోషిగా నిలబెడతాం

**-డిసెంబర్ 1 నుండి ప్రజల పక్షాన యుద్ధం ఆరంభిస్తాం**

**-రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు శంకర్రెడ్డి**


కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న సింగిల్ విండో మాజీ ఛైర్మన్ శంకర్రెడ్డి

**సరూర్నగర్, నవంబర్ 22 ప్రభాతవార్త:** ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల ముందు దోషిగా భారతీయ జనతా పార్టీ నిలబెడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు ఆరు రోజుల పాటు బైక్ ర్యాలీలు, బహిరంగ సభలు, ఇంటింటికి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను తూర్పారబడుతూ కరపత్రాల పంపిణీ తదితర కార్యక్రమాల ద్వారా సర్కార్పై ప్రజల పక్షాన యుద్ధం చేస్తామని ఆయన వెల్లడించారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్లోని బడంగ్పేట్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను తూర్పారబట్టారు. ఈ సందర్భంగా శంకర్రెడ్డి మాట్లాడుతూ మోసపూరిత హామీలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని నెరవేర్చలేక 11 నెలల్లోనే ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని ఎద్దేవా చేశారు. మహాలక్ష్మి, నిరుద్యోగ భృతి, పింఛన్ల పెంపు, కాలేజీ విద్యార్థినిలకు స్కూటీలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, కౌలు రైతులకు, రైతు కూలీలకు లబ్ధి, 200 యూనిట్ల లోపు గృహాలకు ఉచిత విద్యుత్, రూ.500లకే వంట గ్యాస్, కొత్త రేషన్ కార్డులు, పేదల పెళ్ళిళ్ళకు రూ.లక్షతో పాటు తులం బంగారం తదితర హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన వివరించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా వారి దృష్టిని మళ్ళించడానికి ప్రభుత్వం సర్వేల పేరిట కాలయాపన చేస్తున్నదని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కుల గణనను బిజెపి స్వాగతిస్తున్నదనీ అయితే సర్వే పేరిట మిగతా అంశాలపై ప్రజలను ప్రభుత్వం అయోమయానికి గురి చేస్తున్నదని ఆయన విమర్శించారు. అధికా రంలోకి వచ్చిన ఏడాది కాక ముందే కాంగ్రెస్ నిజ స్వరూపాన్ని తెలుసుకున్న రాష్ట్ర ప్రజలు ఛీకొడుతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ హామీలను నెరవేర్చని పాలకులను దోషిగా నిలబెడుతూ బిజెపి మరో యుద్ధానికి సిద్ధమైందని ఆయన వెల్లడించారు. డిసెంబర్ 1వ తేదీ నుండి రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్రెడ్డి నాయకత్వంలో ప్రారంభమయ్యే నిరసన కార్యక్రమాలను పార్టీ శ్రేణులు, ప్రజలు విజయవంతం చేయాలని శంకర్రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్సీమోర్చా రాష్ట్ర నాయకుడు చెవ్వ శ్రవణ్కుమార్, మీర్పేట్ కార్పొరేషన్ బిజెపి ప్రధాన కార్యదర్శి గాజుల మధు, రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు రామిడి మహేందర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ పోర్టల్స్ సంక్షేమాన్ని కృషి : అధ్యక్షుడు మారుతి


ఆర్టీసీ పోర్టల్స్ సమస్యలను తెలుసుకుంటున్న అధ్యక్షుడు మారుతీ తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 22, ప్రభాతవార్త:** ఆర్టీసీ పోర్టల్స్కు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమాన్ని కృషి చేస్తామని అధ్యక్షులు మారుతి పేర్కొన్నారు తెలంగాణ రాష్ట్రంలోని ఆర్టీసీ పోర్టల్స్ సమస్యల పరిష్కారం కోసం చాదర్ ఘాట్ నుండి చేపట్టిన రాష్ట్ర పర్యటనలో భాగంగా రెండో విడత కరీంనగర్ బస్టాండ్లో ఆయన పర్యటించి కార్గో పార్సిల్ లో పనిచేస్తున్న పోర్టల్స్ సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోర్టల్స్కు ఉచిత బస్సు పాసులు అందజేయాలని, విశ్రాంతిభవనం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. 24 గంటలు నిరంతరం పనిచేస్తూ చాలీచాలని జీతాలతో నెట్టుకోస్తున్న పోర్టల్స్ జీతాలను పెంచాలని కోరారు. పోర్టల్స్ ఎదుర్కొంటున్న సమ స్యలను తెలుసుకోవడం కోసం రాష్ట్ర పర్యటన కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. పోర్టల్స్ సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, పోచయ్య, శంకర్, అంజి ,లక్ష్మయ్య, భూమయ్య, రాజయ్య పాల్గొన్నారు.

## ఉప్పల్లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, నవంబరు 22 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఉప్పల్ ఎఇ ఎం.నిఖిల్ తెలిపారు. ఉప్పల్ 11 కెవి చిలుకానగర్ పీడర్ పరిధిలోని చిలుకానగర్, గణేష్నగర్, సెవెన్హిల్స్కాలనీ, సాయిరాం కాలనీ, శ్రీనివాస హైట్స్, అపూర్వ హైట్స్ తదితర ప్రాంతాల్లో ఉదయం పదిన్నర గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

**రామంతాపూర్లో..**

రామంతాపూర్ 11 కెవి చర్చికాలనీ పీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ కె.లావణ్య తెలిపారు. రామంతాపూర్ చర్చికాలనీ, ప్రగతినగర్, నెహ్రూనగర్, ఇందిరానగర్, ఆనంద్నగర్, దోభీఘాట్ తదితర ప్రాంతాల్లో ఉదయం పదిన్నర నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.


సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన వనస్థలిపురం జోన్ నారాయణ స్కూల్స్ జోనల్ స్పోర్ట్స్ మీట్/నారాయణ ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవ వేడుకల్లో ప్రిన్సిపాల్ బాబ్జి ఆధ్వర్యంలో మార్చ్ ఫాస్ట్ చేస్తున్న మీర్పేట్ బ్రాంచి నారాయణ ఒలంపియాడ్ అండ్ ఐఐటి పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు. ప్రారంభ వేడుకల్లో ఎల్బినగర్ ఎమ్మెల్యే సుధీర్రెడ్డి, ఎల్బినగర్ డిసిసి ప్రవీణ్కుమార్, నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ గోపాల్రెడ్డి, వనస్థలిపురం జోన్ ఎజిఎం రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. (సరూర్నగర్ ప్రభాతవార్త)

## అవసరమైన చోట నూతన రోడ్ల నిర్మాణం : కార్పొరేటర్ రాజశేఖర్రెడ్డి



రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్రెడ్డి

**సైదాబాద్, నవంబరు 22 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్లో అవసరమైన చోట నూతన రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని గౌతమ్నగర్ కాలనీలో రూ.38 లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను శుక్రవారం కాలనీవాసులతో కలిసి పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్లోని అన్ని కాలనీలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వరప్రసాద్రెడ్డి, లక్ష్మారెడ్డి, రాకేష్, నాయకులు ప్రవీణ్రెడ్డి, శ్రీధర్గౌడ్, రోహిత్రెడ్డి, శ్రీనాథ్, నరేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**రామంతాపూర్, నవంబరు 22 ప్రభాతవార్త :** రామంతాపూర్ వెంకట్రెడ్డినగర్లోని శ్రీ త్రిశక్తి నల్ల పోచమ్మ దేవాలయంలో శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ మల్కాజిగిరి ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, సీనియర్ నేతలు పసుల ప్రభాకర్రెడ్డి, గంధం నాగేశ్వర్రావు, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శ్రీ త్రి శక్తి నల్ల పోచమ్మ ఆలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. ఆలయ ప్రతిష్టాపన అంగరంగ వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా శుక్రవారం బోనాల ఉత్సవాలు నిర్వహించారు. శనివారం ఫలహార బండి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ గడ్డం సాయికిరణ్, అధ్యక్షుడు ఆవుల సుధాకర్, వర్కింగ్ ప్రసిడెంట్ యండపల్లి సుదర్శన్రెడ్డి, ప్రధాన కార్యదర్శి పచ్చిమట్ల అనిల్గౌడ్, కోశాధికారి ఎడమ నవీన్రెడ్డి, రాగి వెంకట్రెడ్డి, పారుపల్లి హనుమంతరావు, పిసరి శంకర్, వెంకట్గుప్త, మల్లేష్గౌడ్, రాజేంద్ర ప్రసాద్, తోట శ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలు డా.బి.వి.చారి, సోమిరెడ్డి, బోసాని పవన్, సూరం శంకర్, చాంద్పాషా,దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాలాజీ ఎన్క్లేవ్లో కార్పొరేటర్ బన్నాల గీత పర్యటన


బాలాజీ ఎన్క్లేవ్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, నవంబరు 22 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ పరిధిలోని బాలాజీ ఎన్క్లే వ్ కాలనీలో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో పార్కుల ను సందర్శించి మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కాలనీలో కొన్ని వీధులలో రోడ్లపై నీరు నిల్వ ఉంటుందని, వెంటనే మరమ్మతులు చేయాలని సూచిం చారు. బాలాజీ ఎన్క్లేవ్, నార్త్ కల్యాణపురిలో రెండు జివిపి పాయింట్లు ఏర్పాటు చేస్తామని కాలనీ నేతలు హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. చౌరస్తాలో సెంట్ర ల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కార్పొరేటర్ను కోరారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో త్వరలోనే అన్ని పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ వినీత్రావు, హార్టికల్చరల్ ఎఇ నరసింహారావు, శానిటేషన్ జవాన్ జగన్, ఎల్కక్టికల్ బాలరాజు, కాలనీ అధ్యక్షుడు జగదీశ్వర్రెడ్డి, కాలనీ నేతలు వేణుగో పాల్రెడ్డి, కెవిన్ కెనడీ, రమణ, మస్తాన్వలీ, శశికుమార్, కేశవరెడ్డి,రామరావు, రాం ప్రసాద్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ అభయాంజనేయస్వామి వార్షికోత్సవ వేడుకలు


శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం వార్షికోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్రెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 22 ప్రభాతవార్త :** శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం వార్షికోత్స వ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్రెడ్డి,పార్టీ ఇంచార్జ్ ఎం. పరమేశ్వర్రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. ఆలయంలో భక్తులకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లుకాస్, అధ్యక్షుడు నాగేశ్వర్రావు, బిక్షపతిచారి, మధుబాబు, సుధాకర్, సురేందర్రెడ్డి, శ్రీధర్ప్రసాద్, షేక్ జకీర్, అరవింద్బాబు, కె.శ్రీను, వేణు, ప్రసాద్, బ్రహ్మచారి, నామని నాగరాజు, నరసింహులుచారి, యాదగిరి, శంకరయ్య, పాండురంగాచారి, బెస్త రవి, కేశవరెడ్డి, శ్రీశైలం, మల్లుబాయ్, లక్ష్మి, శిరీష, నర్మద,ఝాన్సీ, పుష్పలత, జయ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో ఎం.పరమేశ్వర్రెడ్డి పూజలు


రామంతాపూర్ శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఇంచార్జ్ ఎం.పరమేశ్వర్రెడ్డి

**ఉప్పల్, నవంబరు 22 ప్రభాతవార్త :** రామంతాపూర్ వెంకట్రెడ్డినగర్లోని శ్రీ త్రిశక్తి నల్ల పోచమ్మ ఆలయం విగ్రహా ప్రతిష్టాపన కార్యక్రమంలో శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్రెడ్డి సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. ఆలయంలో భక్తులకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచిం చారు. ఉత్సవాలు ఆనందోత్సవాలతో చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ గడ్డం సాయికిరణ్, అధ్యక్షుడు అవుల సుధాకర్, ఎం. సుదర్శన్రెడ్డి, తౌఫిక్, అనిల్గౌడ్, నవీన్రెడ్డి, వెంకటొరెడ్డినగర్ కాలనీ నేతలు బిల్లకం టి యాదయ్య, గడ్డం నరసింహ, శ్రీరాములు, శ్రీనివాసాచారి, జి.స్వామి, పాశం రవీందర్రెడ్డి, బాలయ్య, కిషోర్, సురేష్, సునీల్,సిద్దులు, రఘు, మల్లేష్, చందు, భాను, రాజేష్, భాస్కర్, శివ, అశోక్, నారాయణ పాల్గొన్నారు.

## రాష్ట్రప్రతి ద్రౌపదిముర్ముకు కార్పొరేటర్ల ఘనంగా వీడ్కోలు


రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు వీడ్కోలు పలుకుతున్న కార్పొరేటర్ చేతన, బండారు శ్రీవాణి తదితరులు

**ఉప్పల్, నవంబరు 22 ప్రభాతవార్త :** నగర పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపదిముర్మును రామంతాపూర్, హబ్సిగూడ కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన ఘనంగా వీడ్కోలు పలికారు. రాష్ట్రపతి పర్యటనతో నగరంలో పండుగ వాతావరణం నెలకొందని, తెలంగాణ పర్యటనలో ఉన్న రాష్ట్రపతి పాల్గొనడం అభినందనీయమన్నారు. రాష్ట్రపతిని కలిసిన వారిలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.